# అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- వివిధ పార్టీల ప్రతినిధులు, అధికారులతో పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, డిసెంబర్ 14: జిల్లాలో అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఆమె పార్లమెంట్ ఎన్నికలపై వివిధ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పొరపాట్లను సరి చేయాలన్నారు. ఓటరు జాబితాలో సవరణలు 2024 ముందు పోలింగ్ పునర్వ్యవస్థీకరణ చేయాలని సూచించారు. మరణించిన వారి పేర్లు మరణ ధ్రువీకరణ పత్రం ఆధారంగా తొలగించాలని, బదిలీ అయిన వారి పేర్లు కూడా జాబితాల్లో నుంచి తీసి వేయాలన్నారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఫొటోల మార్పు, తదితర పనులు ఈనెల 20 నుంచి జనవరి 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 6 నుంచి 22వ తేదీ వరకు డ్రాఫ్ట్ రోల్‌పై అభ్యంతరాలు, వాదనలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య ఎన్నికల అధికారులు సూచించిన శని, ఆదివారాల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 2న అభ్యంతరాలు డిస్పోస్ చేయడం జరుగుతుందని, 6న తుది ప్రచురణ కోసం ఎన్నికల కమిషన్ అనుమతి కోసం పంపనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 8న తుది జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ ఒక కుటుంబంలోని ఓట్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### బాలికా సాధికారతపై అవగాహన కల్పించాలి

జిల్లాలోని ప్రభుత్వ విద్యాలయాలు, కస్తూర్బాల్లో బాలికా సాధికారతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బాల్లో క్లబ్‌ల ఏర్పాటుపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తమకు ఎదురయ్యే సమస్యలు, ఇతర ఇబ్బందులపై బాలికలు చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు. బాల్య వివాహాల చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో సరస్వతి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి, డీఈవో జనార్దన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## 21న అడహక్ కమిటీ ఎన్నిక

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 14: కరీంనగర్ ఉమ్మడి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ కరీంనగర్ అడహక్ కమిటీని ఈ నెల 21న రెవెన్యూ గార్డెన్‌లో ఏర్పాటు చేస్తామని జిల్లా మత్స్య శాఖ అధికారి దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు తమ గుర్తింపు కార్డుతో హాజరు కావాలని సూచించారు.

## సీనియర్ సిటిజన్ల సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీవో మహేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్లు

కలెక్టరేట్, డిసెంబర్ 14: జిల్లాలో సీనియర్ సిటిజన్లు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు కోరారు. ఈ మేరకు గురువారం రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ తరపున ఆర్డీవో మహేశ్వర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ల సంఘం సలహాదారు డా.ముదుగంటి సుధాకర్‌రెడ్డి, సంఘం బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి జూడో పోటీలకు విద్యార్థిని ఎంపిక




సాన్వితను అభినందిస్తున్న మానేరు విద్యా సంస్థల అధినేత అనంతరెడ్డి

కొత్తపల్లి, డిసెంబర్ 14: కేరళ రాష్ట్రంలోని కొచ్చి నగరంలో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్స్ బాలబాలికల జూడో చాంపియన్ షిప్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు పాఠశాల విద్యార్థిని బింగి సాన్విత ఎంపికైనట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. కాగా, పాఠశాలలో గురువారం సాన్వితను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంత రెడ్డి, డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు మహేందర్, తిరుపతి, జహేద, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## పేద విద్యార్థికి ఆర్థిక సాయం

హౌసింగ్‌బోర్డు కాలనీ, డిసెంబర్ 14: నగరంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థి నూతి లక్ష్మీప్రసాద్‌కు హమ్ స్వచ్ఛంద సంస్థ తరపున రూ. 5 వేల నగదు అందజేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గోగూరి శ్రీధర్ రెడ్డి, కొండకింది వేణుగోపాల్ శర్మ పాల్గొన్నారు.

## ప్రతి హామీని అమలు చేస్తాం

- పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ టీ జీవన్ రెడ్డి

రాంనగర్, డిసెంబర్ 14: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి రావాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ. 10 లక్షలకు పెంచినట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం అమలులోకి వచ్చిందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 17న యాక్టింగ్ వర్క్‌షాపు

తెలంగాణచౌక్, డిసెంబర్ 14: నగరంలోని ఫిలిం భవనంలో హాలీవుడ్ ఫిలిం నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 17న యాక్టింగ్ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు సినీ రచయిత, దర్శకుడు శ్యాంసుందర్ తెలిపారు. నగరంలోని ప్రెస్ భవనంలో గురువారం ఆయన సినీ కళాకారులు కలర్ సత్తన్న, జీఎస్ ఆనంద్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శిక్షణ పొందిన వారికి సంస్థ తరపున సర్టిఫికెట్‌ను అందించడంతోపాటు త్వరలో నిర్మిస్తున్న చిత్రంలో నటులుగా అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో ఓంప్రసాద్, సుదర్శన్‌గౌడ్, పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని వినతి

తెలంగాణచౌక్, డిసెంబర్ 14: నగరంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను గురువారం కరీంనగర్ జిల్లా పబ్లిక్, ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్న రవి ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని వినతి పత్రం అందజేశారు. యూనియన్ నాయకులు ఆరిఫ్, కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

## 18న మెగా ఉద్యోగ మేళా

చొప్పదండి, డిసెంబర్ 14: పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఈనెల 18న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ రత్నాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ గుండేటి వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వైభవంగా అయ్యప్ప పడిపూజ



హర్షికకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు

చొప్పదండి(రామడుగు), డిసెంబర్ 14: మండలంలోని వెలిచాల గ్రామంలో దైవాల రమణ-శ్రీలత దంపతులు తమ కూతురు హర్షిక పుట్టిన రోజు సందర్భంగా అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు.అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. పడిపూజకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు హాజరయ్యారు. హర్షికకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.

## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ధర్మపురి, డిసెంబర్ 14: ప్రతి విద్యార్థి చదువుపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాధికారి డాక్టర్ బొల్లం జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. ధర్మపురి కస్తూర్బాను గురువారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల కనీస సామర్థ్యాలు ఎలా ఉన్నాయి అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకోవాలని సూచించారు. విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు వారికి చదువుతో పాటు నైతిక విలువలను వివరించాలని సూచించారు. విద్యార్థులు పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వెనకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, టీ, పాలు, రాత్రి భోజనం అందించాలని డీఈవో పేర్కొన్నారు. ఇక్కడ ఎంఈవో బత్తుల భూమయ్య ఉన్నారు.

## భావి భారత సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులే కీలకం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచ్ నవీన్‌రావు

గంగాధర, డిసెంబర్ 14: భావి భారత సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని సర్పంచ్ మేచినేని నవీన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో పని చేసిన ప్రధానోపాధ్యాయుడు సట్టు పురుషోత్తం, ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రావు, మాధవీలత, వెంకటేశ్వర్ బదిలీ కాగా గురువారం పాఠశాలలో వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులను సర్పంచ్, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ ఎంపిక పోటీలకు స్పందన



రైఫిల్ షూటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా విద్యాధికారి మాధవి

కొత్తపల్లి, డిసెంబర్ 14: ఎస్జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైఫిల్ షూటింగ్ పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన వచ్చింది. పెద్దపల్లి పట్టణంలోని బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో పోటీలను జిల్లా విద్యాధికారి మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాధవి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉన్నతంగా ఎదుగుతారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని ఈనెల 16 నుంచి 17వ తేదీ వరకు హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో గల షూటింగ్ రేంజ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పాఠశాలల రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పెద్దపల్లి జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ కొమురోజు శ్రీనివాస్ తెలిపారు.

## ఎమ్మెల్యేకు సత్కారం

జగిత్యాల టౌన్, డిసెంబర్ 14: కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను టీఎన్జీవోస్ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంజయ్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, జిల్లా కార్యదర్శి నాగేందర్‌రెడ్డి, నాయకులు అమరేందర్‌రెడ్డి, శ్రీనివాసస్వామి, మహమూద్, సుగుణాకర్, మధుకర్ తదితరులున్నారు.